
సాక్షి
గుంటూరు
మంగళవారం । 23 । జూలై । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 503.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



పెదనెమలిపురిలో కవాతు

రాజుపాలెం: పెదనెమలిపురిలో పోలీసు అధికారులు, సిబ్బంది సోమవారం కార్డన్ సెర్చ్, కవాతు నిర్వహించారు. సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు పాల్గొన్నారు.

భద్రకాళీదేవికి గోరింటాకు సమర్పణ



అచ్చంపేట: స్థానిక పాలకేంద్రం సెంటర్‌లోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో సోమవారం మహిళలు అమ్మవారికి ఆషాఢ గోరింటాకు, సారెలను సమర్పించారు.

న్యూస్‌రీల్

ఆగస్టు 3న జెడ్పీ ప్రత్యేక సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని ఆగస్టు 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో ఎస్ఎస్వీబీ వసంతరాయుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2019లో ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేల పదవీ కాలం గత జూన్ 5న ముగియడంతో వారి స్థానంలో కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలను జెడ్పీ స్టాండింగ్ కమిటీల్లో సభ్యులుగా ఎన్నుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందు కోసం పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి ఆగస్టు 3వ తేదీన ఉదయం 10.30 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీలోని ఏడు స్టాండింగ్ కమిటీల్లో పదవీ కాలం ముగిసిన సభ్యుల స్థానంలో కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలను సభ్యులుగా ఎన్నుకుని, ఆయా ఖాళీలను భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఒక్కో కమిటీలో 12 మంది సభ్యులు ఉండాల్సిన దృష్ట్యా, పదవీ కాలం ముగిసిన సభ్యుల స్థానంలో 1,2,4,7వ కమిటీల్లో వరుసగా ముగ్గురేసి చొప్పున సభ్యులను ఎన్నుకోవాల్సి ఉందని తెలిపారు. 3, 5, 6వ స్థాయీ సంఘాల్లో ఇద్దరేసి చొప్పున సభ్యులను ఎన్నుకోవాలని వివరించారు.

24, 25 తేదీల్లో స్పేస్ ఎగ్జిబిషన్

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (ఇస్రో–షార్) ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 24, 25 తేదీల్లో గుంటూరు రూరల్ మండలం చోడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో స్పేస్ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రదర్శనలో భాగంగా రాకెట్ నమూనాలు, శ్రీహరికోట నుంచి జరిగిన వివిధ ప్రయోగాలు, లాంచ్ ప్యాడ్ల ప్రదర్శనతోపాటు ఇస్రో, ప్రముఖ శాస్త్రవేత్తల ఉపన్యాసాలు ఉంటాయని తెలిపారు. 25వ తేదీ ఉదయం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తారని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత, హైస్కూల్ ప్లస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల్లోని ఆసక్తి కలిగిన విద్యార్థులను గైడ్ టీచర్ల సహాయంతో ఎగ్జిబిషన్‌ను సందర్శించేందుకు అనుమతించాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరాను 78428 69407 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



తెనాలిఅర్బన్: ఎన్‌సీసీలో చేరడం వలన క్రమశిక్షణతో కూడిన జీవితం అలవడుతుందని 22వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మహేష్ పేర్కొన్నారు. కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో సోమవారం ఎన్‌సీసీ సెలక్షన్స్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనతరం వివిధ రకాల పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీ మాట్లాడుతూ మొత్తం 120 మంది విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు ముందుకు వచ్చారని, వారికి అన్ని పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. 80 మందిని ఎన్‌సీసీకి ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

4,629 హెక్టార్లలో వరి పంటకు నష్టం

కొరిటిపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గుంటూరు జిల్లాలో 4,629 హెక్టార్లలో వెద పద్ధతిలో సాగు చేసిన వరి పంట నీట మునిగి దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వట్టిచెరుకూరు, పెదకాకాని, చేబ్రోలు, తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని 37 గ్రామాలకు చెందిన 4,393 మంది రైతులు వెద పద్ధతిలో సాగు చేసిన వరి పంట నష్టపోయారని గుర్తించి వ్యవసాయ అధికారులు నివేదిక తయారు చేశారు. వీటిపై వాతావరణం అనుకూలించిన తర్వాత పూర్తి స్థాయి నివేదిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.5,000, గరిష్ట ధర రూ.7,300, మోడల్ ధర రూ.6,000 వరకు పలికింది.

సైక్లింగ్ సుబ్బయ్య



- వెటరన్ క్రీడాకారుడి ప్రతిభ
- 57 ఏళ్ల వయస్సులో వెయ్యి సెంచరీలు
- సైకిల్ ఎక్కాక దిగకుండా వంద కిలోమీటర్లు తొక్కితే ఒక సెంచరీ
- 1.35 లక్షల కి.మీ. సైక్లింగ్ చేసిన క్రీడా యోధుడు
- యోగా, స్విమ్మింగ్‌లోనూ సత్తాచాటుతున్న వైనం
- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘనత సాధించిన ఏకైక వ్యక్తి

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : వయసు పెరుగుతున్నా సెంచరీలు కొట్టే వయసు నాది అంటూ సైక్లింగ్‌లో సత్తాచాటుతున్నారు గుంటూరుకు చెందిన వెటరన్ క్రీడాకారుడు బండ్లమూడి సుబ్బయ్య. కఠోర సాధనతో సైక్లింగ్‌లో వెయ్యి సెంచరీలు(వంద కిలోమీటర్లు ఓ సెంచరీ) పూర్తిచేసి అందరినీ ఔరా అనిపించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ ఘనత సాధించిన ఏకైక వ్యక్తిగా నిలిచారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభమయ్యే ఆయన సైకిల్ ప్రయాణం దాదాపుగా 8.30 గంటలకు పూర్తవుతుంది. సైక్లింగ్ తోపాటు యోగా, స్విమ్మింగ్ ల్లోనూ రాణిస్తున్నారు.



సాధించిన పతకాలతో సుబ్బయ్య

సరదాగా ప్రారంభమై..

తొలి నాళ్లలో స్విమ్మింగ్ సాధన చేసిన సుబ్బయ్యకు కరోనా సమయంలో సైక్లింగ్‌పై మక్కువ పెరిగింది. స్నేహితులతో ప్రారంభమైన సైకిల్ సవారీ ఇప్పుడు ఆయనను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ దిశగా తీసుకెళుతుంది. ఈయన నగరంలోని కొందరు వైద్యులతో కలిసి సైక్లింగ్ క్లబ్స్ ప్రారంభించారు. ప్రజలను సైక్లింగ్ చేసేలా ప్రోత్సహిస్తున్నారు.

మల్టీ ట్యాలెంట్

జాతీయ స్థాయిలో స్ట్రావా అనే యాప్ ఉంది. సైక్లిస్ట్‌లు దాన్లో తమ వివరాలు నమోదు చేసుకుంటే వారు సైక్లింగ్ చేసే స్పీడ్‌తోపాటు ఎన్ని కిలోమీటర్లు ఎంత సమయంలో పూర్తి చేశారనే వివరాలు నమోదు చేస్తుంది. సుబ్బయ్య ఇటీవల 1,000 సెంచరీలతోపాటు సుమారు 1.35 లక్షల కిలోమీటర్లు దూరం పూర్తి చేశారు. రోజూ ఉదయం 100 కి.మీ. నాన్ స్టాప్‌గా సైకిల్ తొక్కుతారు. ఇదొక రికార్డనే చెప్పాలి.



వెయ్యి సెంచరీలు పూర్తయిన సందర్భంలో సుబ్బయ్యకు తోటి సైక్లిస్టుల అభినందనలు



ఈత కొలనులో యోగా చేస్తున్న సుబ్బయ్య

జాతీయ స్థాయిలో జరిగే సైక్లింగ్ చాలెంజ్ పోటీల్లో సుబ్బయ్య విజయాలు సాధించారు. సుబ్బయ్య స్విమ్మింగ్‌లో మాస్టర్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 30కుపైగా కాంస్య, రజత, బంగారు పతకాలతోపాటు మరో 3 జాతీయ స్థాయి పతకాలు సాధించారు. కృష్ణా నదిలో 1.5 కి.మీ.లను నాలుగుసార్లు ఈది బహుమతులు సాధించారు. యోగాసనాలతో మంత్రముగ్ధుల్ని చేస్తారు. సుబ్బయ్యకు 57 సంవత్సరాలు. ఇటీవల ఆయన కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 3,700 కిలోమీటర్లు సైక్లింగ్‌ను స్నేహితులతో కలిసి పూర్తి చేశారు.

ఆరోగ్యం కోసం ఏదైనా చేయండి

సంపాదనలో పడి చాలా మంది ఆరోగ్యంపై కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. అందుకే కరోనా సమయంలో విపరీతమైన ప్రాణనష్టం జరిగింది. ఆ సమయంలో నా సన్నిహితులనూ కోల్పోయాను. ప్రజలకు అవగాహన కల్పించాలంటే ముందుగా నేను ఆచరించాలి. అందుకే సైక్లింగ్, స్విమ్మింగ్, యోగాల్లో ప్రావీణ్యం పొందాను. ఎవరికి నచ్చిన క్రీడలో వారు సాధన చేస్తే మంచిది. రానున్న నవంబర్‌లో గోల్డెన్ క్వార్డిలేటర్ చెన్నై– కోల్‌కతా–ఢిల్లీ–ముంబై ఈ నాలుగు ప్రధాన నగరాలను కలుపుకుంటూ సుమారు 6,000 కి.మీ. మేర సైక్లింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాను.

– బండ్లమూడి సుబ్బయ్య, సైక్లిస్ట్, గుంటూరు

సీఐల బదిలీ ఉత్తర్వులు నిలిపివేత?

- పోలీసు వర్గాల్లో చర్చ
- ఐజీ ఆదేశాలు ఇచ్చినా రిలీవ్ కాలేదు
- పోస్టింగ్‌లు మారే అవకాశం
- తమకు అన్యాయం జరుగుతుందంటూ సీఎం దృష్టికి తీసుకువెళ్లిన సీఐలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు రేంజి పరిధిలో ఐజీ ఇచ్చిన బదిలీ ఉత్తర్వులు నిలిపివేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన కొందరు సీఐలు ఈ ప్రభుత్వంలో కూడా తమకు అన్యాయం జరుగుతోందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ బదిలీ ఉత్తర్వులు నిలిపివేసినట్లు సమాచారం. ఈ నెల 16న గుంటూరు రేంజి పరిధిలో పనిచేస్తున్న విజయచరణ్‌ను నరసరావుపేట వన్‌టౌన్, సిరిగిరి సాంబశివరావును నరసరావుపేట–2 టౌన్, యు. శోభన్‌బాబును వినుకొండ టౌన్, పసుపులేటి రామకృష్ణను నరసరావుపేట రూరల్, బలగాని ప్రభాకర్‌ను వినుకొండ రూరల్, బి సుబ్బనాయుడిని చిలకలూరిపేట రూరల్, కె.వెంకట ప్రసాద్‌ను అచ్చంపేట, ప్రత్తిపాటి సురేష్‌ను పెదకూరపాడు సర్కిల్, ఎం సుబ్రమణ్యంను సత్తెనపల్లి టౌన్, పొలూరి శ్రీనివాస్‌ను సత్తెనపల్లి రూరల్‌కు బదిలీ చేస్తూ సౌత్ కోస్టర్ జోన్ గుంటూరు రేజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ ఆదేశాలు జారీ చేశారు. మరుసటి రోజు వీరు ఆయా స్థానాల్లో చేరాల్సి ఉంది. మరుసటిరోజు వినుకొండలో దారుణ హత్య జరగడం, అది జరిగిన తీరు దేశవ్యాప్త చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. ఈలోగా గుంటూరు రేంజి పరిధిలో పనిచేస్తున్న కొంతమంది సీఐలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి తమకు మంచి పోస్టింగ్‌లు ఇవ్వాలని పట్టుపట్టినట్లు తెలిసింది. మరోవైపు ఈ పోస్టింగ్‌ల వెనుక భారీగా డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు వచ్చాయి. స్థానిక ఎమ్మెల్యేల లేఖలు ఉండటంతో ఐజీ పోస్టింగ్‌లు ఇచ్చారు. ప్రతి నియోజకవర్గంలో తమ సామాజిక వర్గానికి పెద్ద పీట వేయాలంటూ వారు ఒత్తిడి తేవడంతో మొత్తం బదిలీల ప్రక్రియను నిలిపివేశారు. ప్రతి నియోజకవర్గం పరిధిలోనూ కనీసం ఒక సీఐ పోస్టింగ్ అయినా తమకు దక్కాలని వారు పెద్ద ఎత్తున ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. మళ్లీ ఒకటి రెండు రోజుల్లో పోస్టింగ్‌లు వస్తాయని, అవి లోకేష్ నేతృత్వంలో జరుగుతాయన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే గుంటూరు నగరంలో వేసిన పోస్టింగులు ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా లోకేష్ వేయడం, మరికొన్ని స్టేషన్లకు కూడా తాను చెప్పిన వారినే వేస్తారని, మీరు జోక్యం చేసుకోవద్దని స్థానిక ఎమ్మెల్యేలకు చెప్పినట్లు తెలిసింది. తమ పరిధిలో తాము చెప్పిన వారికి కాకుండా పైనుంచి పోస్టింగ్‌లు వేస్తే తమకు పట్టు ఏం ఉంటుందని ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

ఏఎన్‌యూలో పాలనా పదవులు భర్తీ

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పాలనా పదవులను భర్తీ చేస్తూ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు సోమవారం నిర్ణయం తీసుకున్నారు. యూనివర్సిటీ రెక్టార్‌గా ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్‌గా ఆచార్య జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ కృష్ణసత్య, పీజీ పరీక్షల కో–ఆర్డినేటర్‌గా ఆచార్య ఎం.సుబ్బారావు, దూరవిద్య కేంద్రం పరీక్షల కో–ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ డి.రామచంద్రన్, రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ పి.సుధాకర్, సీడీసీ డీన్‌గా ప్రొఫెసర్ వి.రవికుమార్, జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం కో–ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ పి.జె.రత్నాకర్, యూజీసీ కో–ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎం.త్రిమూర్తిరావు, దూరవిద్య కేంద్రం స్టడీ సెంటర్ల కో–ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ ఎల్.లింగరాజు నియమితులయ్యారు. రిజిస్ట్రార్‌గా ఆచార్య జి.సింహాచలం, రెక్టార్‌గా ఆచార్య కె.రత్నషీలామణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పదవులు పొందిన అధికారులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి, వీసీ కె.గంగాధర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.



యూనివర్సిటీ పాలనా పదవుల్లో నియమితులైన వారితో వీసీ ఆచార్య గంగాధరరావు

అర్జీల పరిష్కారంపై దృష్టిపెట్టాలి

అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: అధికారులు అర్జీల పరిష్కారంపై దృష్టిపెట్టాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఒక్క అర్జీ పరిష్కారం కోసం పదేపదే తిప్పుకోకుండా చూడాలని అధికారులకు సూచించారు. పరిష్కారానికి అవకాశంలేని అర్జీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇసుక విక్రయాల్లో అవినీతిని ఉపేక్షించబోమని పేర్కొన్నారు. ఇసుకపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం వచ్చిన 215 అర్జీలను కలెక్టర్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పరిశీలించారు.



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

మౌలిక వసతులు కల్పించండి



70 కుటుంబాలు సుమారు రెండేళ్ళ నుంచి కొర్నెపాడులోని జగనన్న కాలనీల్లో నివాసం ఉంటున్నాయి. వర్షాలు పడుతుండడంతో రోడ్లు పాడైపోయాయి. మంచినీటి సౌకర్యం లేదు. కూలీ నాలీ చేసుకుని జీవించే మాకు కొంత ఆసరా ఇవ్వండి. మౌలిక వసతులు కల్పించండి.

– జగనన్న కాలనీ వాసులు, కొర్నెపాడు, వట్టిచెరుకూరు మండలం

16 నెలల జీతాల బకాయిలు వెంటనే చెల్లించండి



ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్‌లో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న వారికి సుమారు 16 నెలల నుంచి జీతాలు ఆపేశారు. దీంతో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తక్షణం పెండింగ్ జీతాలను చెల్లించడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, లీవ్, టీఏ, డీఏ సౌకర్యాలు కల్పించాలి.

– ఏపీ కమ్యూనిటీ నేచరల్ ఫార్మింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు

మెప్మాలో రుణాల స్వాహా!

- అక్రమాలపై అధికారుల విచారణ
- బోగస్ గ్రూపులతో రూ.లక్షలు కాజేశారని ఆరోపణలు
- అధికారుల ముందే మెప్మా సిబ్బంది వాగ్వాదం

పొన్నూరు: పొన్నూరు మెప్మా విభాగంలో జరిగిన అక్రమాలపై జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. పట్టణంలోని మెప్మా సిబ్బంది తమ ప్రమేయం లేకుండా అక్రమంగా లక్షల రూపాయలు రుణాలు స్వాహా చేయడంతో బ్యాంకుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పొదుపు సంఘాల మహిళా సభ్యుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు మెప్మా పీడీ వెంకటేశ్వరరావు విచారణకు ఆదేశించారు. నిడుబ్రోలు పరిధిలోని మెప్మాలో (శాంతి, లక్ష్మీ, వైఎస్ఆర్, మదర్ థెరిసా, దుర్గమ్మ) పేర్లతో మహిళా గ్రూపులు ఉన్నాయి. వాటిలో తారా మహిళా గ్రూప్ రూ.8 లక్షలు, మరో నాలుగు గ్రూపులు ఒక్కొక్క గ్రూపు రూ.10 లక్షల చొప్పున వివిధ బ్యాంకుల ద్వారా గతేడాది రుణాలు పొందాయి. అయితే ఆ రుణాలలో ఒక్కొక్క సభ్యురాలికి రూ.30 వేలు మాత్రమే అందించి, మిగిలిన మొత్తాన్ని మెప్మా సిబ్బంది స్వాహా చేశారని గ్రూపు సభ్యులు ఆరోపిస్తున్నారు. వాయిదాలూ చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారుల నుంచి నోటీసులు అందాయని బాధితులు చెబుతున్నారు. తీసుకున్న రుణం ఒక్కొక్క గ్రూపునకు రూ.3 లక్షలే అయినా రూ.10 లక్షలు చెల్లించాలని బ్యాంకుల నుంచి నోటీసులు రావడంతో బాధితులు బ్యాంకులకు వెళ్లి విచారణ చేశారు. రుణాలు తీసుకున్నది వాస్తవమని, వాయిదాలు చెల్లించాల్సిందేనని గ్రూపు సభ్యులకు బ్యాంకు అధికారులు తేల్చిచెప్పడంతో దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని సభ్యులు ఉన్నతాధికారులను కోరారు. బాధితుల విన్నపం మేరకు సంబంధిత అధికారులు సోమవారం విచారణ చేశారు. బ్యాంకులకు వెళ్లి గ్రూపుల రుణాలపై ఆరా తీశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో సీఎంఎం జ్యోత్స్న, ఆర్పీ సంధ్యలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల సమక్షంలోనే సీఎంఎం జ్యోత్స్న, ఆర్పీ సంధ్య ఒకరిపై ఒకరు నిందలు వేసుకుని వాగ్వాదానికి దిగారు. దీంతో విచారణ అధికారులు నివ్వెరపోయారు. పట్టణంలో మరికొన్ని బోగస్ గ్రూపులతో రుణాలు పొందారని, మెప్మాలో జరుగుతున్న అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పలు సంఘాల మహిళలు కోరారు. పూర్తి నివేదికను పీడీకి అందజేయనున్నట్లు విచారణ అధికారులు ఎం. రాజశేఖర్, టి.కీర్తి తెలిపారు.



వాగ్వాదానికి దిగిన సీఎంఎం జ్యోత్స్న, ఆర్పీ సంధ్య



మెప్మా కార్యాలయం వద్ద పోలీసులు

విచారణ చేసి న్యాయం చేయాలి

మా ప్రమేయం లేకుండా ఎక్కువ రుణాలు పొంది సొమ్ములు స్వాహా చేసిన వారిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలి. రూ. 30 వేలు రుణం తీసుకుంటే ఒక్కొక్కరూ రూ.లక్ష చెల్లించాలని నోటీసులు వచ్చాయి. మా పేర్లతో ఇంకేం రుణాలు తీసుకున్నారో తెలీదు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలి.

– తారా, లక్ష్మీ మహిళా గ్రూపు సభ్యులు

కృష్ణమ్మ వరద పరవళ్లు



కృష్ణా నది వద్ద కొనసాగుతున్న వరద

మంగళగిరి: ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదిలో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. ఆదివారం ఉదయం 7 గంటలకు ఎగువ నుంచి 11,450 క్యూసెక్కులు రాగా 14 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి కృష్ణా నదిలోకి నీటిని వదిలారు. 10,150 క్యూసెక్కులను సముద్రంలోకి, 1,509 క్యూసెక్కులను కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు విడుదల చేశారు. రాత్రి 10 గంటలకు వరద ఉద్ధృతి ఇంకా పెరిగింది. 19 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 13,775 క్యూసెక్కులు వదిలారు.

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి: అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పేర్కొన్నారు. సోమవారం గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి మంగళగిరి రూరల్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడిలో ఆధారాలు లేకుండా నిందితులను అదుపులోకి తీసుకోవద్దని పేర్కొన్నారు. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంత్రులు, ఉన్నతాధికారులు నిరంతరం పర్యటిస్తుంటారని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆయా కూడళ్లలో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు నిరంతరం అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

ద్విచక్రవాహన దొంగల ముఠా అరెస్ట్

నరసరావుపేట టౌన్: అంతర్‌జిల్లాల ద్విచక్రవాహనాల చోరీ ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 16 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. నరసరావుపేట మండలం యలమందకు చెందిన తమ్మిశెట్టి శివ నాగరాజు, సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన మన్నెం రవి, ఒంగోలు పట్టణం విజయనగర్ కాలనీకి చెందిన షేక్ కృపాకర్‌రావు ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తూ పోలీసులను చూసి పారిపోయే యత్నం చేశారన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నరసరావుపేట పట్టణంతో పాటు గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పలు ద్విచక్రవాహనాలు చోరీ చేసినట్లు అంగీకరించారన్నారు. గత నెల 28న ఆర్‌కే బార్ అండ్ రెస్టారెంట్ వద్ద నిలిపి ఉన్న జంగాల మాణిక్యరావుకు చెందిన ద్విచక్రవాహనాన్ని తామే చోరీ చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. దీంతో నిందితులు ఇచ్చిన సమాచారంతో చోరీకి గురైన బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

మానవ అక్రమ రవాణా నివారణలో కీలక పాత్ర పోషించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మానవ అక్రమ రవాణా నివారణ, పునరావాసంలో స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి అన్నారు. సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, హెల్ప్ సంస్థ సంయుక్తంగా గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవా సదనంలో అక్రమ రవాణా బాధితుల పునరావాసం, కమ్యూనిటీ ఆధారిత పునరావాసం అనే అంశంపై గ్రామస్థాయి సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు, గ్రామ బాలల రక్షక కమిటీలు నాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు క్రియాశీలకంగా వ్యవహరిస్తే అక్రమ రవాణా నిరోధంతోపాటు సామాజిక పునరావాసం కల్పించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. హెల్ప్ సంస్థ కార్యదర్శి నిమ్మరాజు రామ్మోహన్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాలల, మహిళల హక్కులకు విఘాతం ఏర్పడితే వెంటనే ప్రభుత్వ శాఖల అధికారుల దృష్టికి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నిస్సహాయస్థితిలో ఉన్న కుటుంబాల వివరాలను గుర్తించాలని చెప్పారు. తద్వారా వారికి అన్నిరకాల సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు. బాలలు, మహిళలపై జరిగే పలు అంశాలపై అవగాహన కల్పించారు. అధ్యక్షత వహించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి మాట్లాడుతూ ఇటువంటి శిక్షణా కార్యక్రమాల ద్వారా వార్డు మహిళా సంరక్షక కార్యదర్శులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని అన్నారు. మరిన్ని సేవలను బాధిత మహిళలు, బాలలకు అందించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ విధి విధానాలను ఎప్పటికప్పుడు బాధిత కుటుంబాలకు తెలపాలని అన్నారు. తద్వారా డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకువస్తే తక్షణమే ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి సీహెచ్ విజయ్‌కుమార్, జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ ప్రమీల, క్రాప్ సంస్థ సమన్వయకర్త సమీర్‌కుమార్, హెల్ప్ ప్రోగ్రాం సమన్వయకర్త భాస్కర్, వన్ స్టాప్ సెంటర్ గుంటూరు ప్రతినిధి విజయలక్ష్మి హాజరవ్వగా, బాలల, మహిళ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

క్లుప్తంగా

ఆర్‌యూబీల వద్ద భద్రతా చర్యలు

డీఆర్‌ఎం రామకృష్ణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : భారీ వర్షాల నేపథ్యంలో ఆర్‌యూబీల వద్ద ప్రజలు ఇబ్బందులు పడకుండా భద్రతా చర్యలు తీసుకుంటున్నట్టు గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ చెప్పారు. ఆయన సోమవారం మాట్లాడుతూ గుంటూరు డివిజన్‌లో ఇప్పటి వరకు 188 ఆర్‌యూబీలను నిర్మించినట్టు వెల్లడించారు. వరదలు, వర్షాల సమయంలో ట్రాఫిక్‌ను ఆపడానికి, భద్రతకు ఆర్‌యూబీల వద్ద రాత్రీపగలూ ఉండేలా వాచ్‌మెన్లను నియమించామని పేర్కొన్నారు. ఆర్‌యూబీల వద్ద పంపింగ్ కాంట్రాక్టర్, రైల్వే అధికారుల ఫోన్ నంబర్లు ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. 188 ఆర్‌యూబీలలో 14 చోట్ల నీరు భారీగా నిలిచిపోయే అవకాశం ఉందని వెల్లడించారు. నీరు నిలవకుండా ఉండే పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. జూన్ 2025 నాటికి పనులు పూర్తయి శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం చంద్రబాబు నివాళి



వెంకటపాలెం(తాడికొండ): అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం సీఎం చంద్రబాబునాయుడు తుళ్లూరు మండలం వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయం 9:30 గంటలకు పలువురు ఎమ్మెల్యేలు నాయకులతో కలిసి వెంకటపాలెం చేరుకున్న చంద్రబాబు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం అసెంబ్లీకి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి తదితరులు ఉన్నారు.

దుగ్గిరాలలో 13.6 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 13.6 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా కొల్లిపర మండలంలో 2.6 మి.మీ వర్షం పడింది. సగటున 4.9 మి.మీ వర్షపాతం నమోదైంది. తెనాలి 6.2, గుంటూరు తూర్పు 6, ఫిరంగిపురం 5.6, చేబ్రోలు 5.4, ప్రత్తిపాడు 5.2, వట్టిచెరుకూరు 5.2, మి.మీ చొప్పున వర్షం పడింది.

పార్టీ విధేయునికి పట్టం

- శాసన మండలి ప్రతిపక్ష నేతగా లేళ్ల అప్పిరెడ్డి
- నమ్ముకున్న వారికి న్యాయం చేయడమే వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ నైజం



అప్పిరెడ్డిని అభినందిస్తున్న మాజీ మంత్రి నాగార్జున, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు తదితరులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): పార్టీ విధేయులు, ఎమ్మెల్సీ, శాసన మండలి మాజీ విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు లేళ్ల అప్పిరెడ్డికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టం కట్టారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా లేళ్లను నియమించారు. దీంతో అప్పిరెడ్డి సేవలకు సముచిత గుర్తింపు ఇచ్చినట్టయింది.

లేళ్ల అప్పిరెడ్డి ప్రస్థానం ఇదీ..

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2006లో ఆసియాలోనే అతిపెద్దదైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చి యార్డు) చైర్మన్‌గా లేళ్ళ అప్పిరెడ్డి నియమితులయ్యారు. దీనికోసం అప్పట్లో వైఎస్ జగన్ సహకరించారు. తర్వాత వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం అవిశ్రాంతంగా శ్రమించిన లేళ్ళ అప్పిరెడ్డికి 2014 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సీటును జగన్ కేటాయించారు. అనంతరం 2020లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులుగా, 2021లో శాసన మండలి సభ్యులుగా.. 2023లో శాసన మండలి విప్‌గా నియమించి అప్పిరెడ్డికి వైఎస్ జగన్ సముచిత స్థానం కల్పించారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా ఆయనను నియమించారు.

అంబరాన్నంటిన సంబరాలు

శాసన మండలి ప్రతిపక్ష నేతగా లేళ్ళ అప్పిరెడ్డి నియమితులు కావడంతో గుంటూరు నగరంలో సంబరాలు అంబరాన్నంటాయి. పలువురు పార్టీ నేతలు చంద్రమౌళీనగర్‌లోని ఆయన నివాసంలో లేళ్ళ అప్పిరెడ్డిని కలిసి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అంగడి శ్రీనివాసరావు, అత్తోట జోసఫ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, దూపాటి వంశీ, వలి వీరారెడ్డి, యక్కలూరి మారుతీ కోటి లింగారెడ్డి, టీఎల్వీ వీరాంజనేయులు, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, పార్టీ నేతలు నూనె ఉమామహేశ్వరరెడ్డి, కొరిటిపాటి ప్రేమ్ కుమార్, కొత్తపల్లి శివ సాంబిరెడ్డి, వలివేటి వెంకటరమణ, మోదుగుల బసవ పున్నారెడ్డి, కౌండిన్య, రేజేటి నవీన్, బైరెడ్డి రవీంద్రారెడ్డి, పోకల వసంత్, సుబ్బరాజు, కిశోర్, సుశీలరావు తదితరులు ఉన్నారు.

బాధితుల పక్షానే పోలీసులు

- న్యాయం చేసేందుకు కృషి చేస్తాం
- పోలీస్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల స్వీకరణ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): బాధితుల పక్షానే పోలీసులు నిలుస్తారని, న్యాయం చేసేందుకు కృషి చేస్తామని జిల్లా సీసీఎస్ డీఎస్పీ శివాజీ రాజు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జరిగిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలు ఆలకించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు మొదలు కావడంతో జిల్లా పోలీస్ అధికారులు బందోబస్తు విధుల నిమిత్తం వెళ్లారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజు

దీంతో సీసీఎస్ డీఎస్పీ ఒక్కరే బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు, చివర్లో పాతగుంటూరు పీఎస్ సీఐ రమేష్‌బాబు హాజరై, ఫిర్యాదులు స్వీకరించారు.

కబ్జా చేశారు..

ఓ హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా పెదకాకానిలో 2 ఎకరాలకుపైగా స్థలం 1982లో కొనుగోలు చేశాం. ప్లాట్లుగా 32 మందికి కేటాయించారు. 2009లో స్థలాన్ని కబ్జా చేశారు. అదేమని అడిగితే మమ్మలను అడ్డుకుంటున్నారు. దీనిపై 2019లో పెదకాకాని పీఎస్‌లో కేసు నమోదైంది. మా స్థలంలో రహదారులు, డ్రెయినేజీ, విద్యుత్ స్తంభాలు వేశారు. కొందరు ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. న్యాయం చేయగలరు.

– కృష్ణారావు, వీరయ్య (హైదరాబాద్), జూపూడి ఉమాదేవి (ఏలూరు), రామారావు (విజయవాడ)

భర్త ఆచూకీ లేదు



నా భర్త రమావత్ వలియా లారీడ్రైవర్. ఈనెల 18న మిర్చియార్డు నుంచి మిరప లోడ్‌తో బయలుదేరి వెళ్లాడు. 19న ఉదయం నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. లారీ యాజమానిని సంప్రదించగా, లారీ భద్రాద్రిగూడెం జిల్లా మణుగూరు పోలీసుల అదుపులో ఉందని చెప్పారు. పూర్తి వివరాలు తెలుసుకుని, చెబుతానని బదులిచ్చాడు. సరైన సమాచారం లేకపోవడంతో ఈనెల 20న నల్లపాడు పీఎస్‌లో భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేశాం. భీమడోలు పీఎస్ పరిధిలో కేసు విచారణ జరుగుతుందని పోలీసులు తెలియజేయడంతో అక్కడకెళ్లాం. అయితే నా భర్తకు ఏమైంది అనేది తెలియడంలేదు. ఆచూకీ తెలియజేయగలరు..

– భార్య రమావత్ బిచానీ, సుగాలికాలనీ, నల్లచెరువు

ఫ్యూన్ ఉద్యోగమని..

రెండేళ్ల క్రితం నరసరావుపేట వాసి పరిచయమై, కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగినని నమ్మబలికాడు. కలెక్టర్, రాజకీయ నేతలు బాగా తెలుసునని, కలెక్టరేట్‌లో ఫ్యూన్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. దీంతో నా కొడుక్కి ఉద్యోగం వస్తుందని అతనికి రూ.2.60 లక్షలు చెల్లించాను. ఉద్యోగ విషయమై అడిగితే కలెక్టర్ సంతకం చేయలేదు, ఫైల్ చూడలేదని చెప్పేవాడు. ఈలోగా కలెక్టరేట్‌లో అతని గురించి ఆరాతీశా. అతనికి ఏ ఉద్యోగం లేదని, గతంలోనూ పలువుర్ని మోసగించినట్లు తెలిసింది. దీంతో డబ్బులివ్వాలని అడిగితే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడు. అతనిపై చర్యలు తీసుకుని, డబ్బులు ఇప్పించాలని కోరుతున్నా.

– పి.బాబు, బాలాజీనగర్ 4వ వీధి, పాతగుంటూరు

యాజమానిపై ఫిర్యాదు



ఏటుకూరులోని ఓ లారీ యాజమాని వద్ద క్లీనర్‌గా పనిచేస్తాను. అతనికి రూ.50 వేలు బాకీ చెల్లించాలి. అనారోగ్యం నిమిత్తం ఒకట్రెండు రోజులు క్లీనర్‌గా వెళ్లలేదు. పనికి ఎందుకు రావడంలేదని యాజమాని నాపై గత నెల్లో దాడికి పాల్పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలై, జీజీహెచ్‌లో చికిత్స చేయించుకున్నా. లాలాపేట పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, ఇప్పటి వరకు చార్జిషీట్ దాఖలు చేయలేదు. యాజమానిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదుచేసి, న్యాయం చేయాలి.


– కె.నాగేశ్వరరావు, అమరావతి, పల్నాడు జిల్లా

సత్తా చాటిన వైద్య విద్యార్థులు



గుంటూరు మెడికల్: గుంటూరులో శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరిగిన ఏపీ న్యూరో కాన్–2024 రాష్ట్ర సదస్సులో గుంటూరు వైద్య కళాశాల న్యూరాలజీ, న్యూరోసర్జరీ పీజీ వైద్య విద్యార్థులు తమ సత్తా చాటారు. క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. డాక్టర్ ముబషీర్, డాక్టర్ భానుచంద్రప్రసాద్, డాక్టర్ కృష్ణప్రియ, డాక్టర్‌సిద్దార్థలు క్విజ్‌పోటీల్లో గెలుపొందిన వారిలో ఉన్నారు. సిమ్స్ పేపర్ ప్రజెంటేషన్ అవార్డుల్లో న్యూరాలజీ తృతీయ సంవత్సరం చదువుతున్న డాక్టర్ కాంతిమ విజేతగా నిలిచారు. మూవ్‌మెంట్ డిజార్డర్స్‌పై న్యూరాలజీ వైద్య విద్యార్థిని డాక్టర్ కాంతిమ ప్రజెంట్ చేసిన పేపర్‌కు అవార్డు లభించింది. గుంటూరు జీజీహెచ్‌లో మూవ్‌మెంట్ డిజార్డర్స్‌తో 23 మంది చికిత్సకు వచ్చినట్లు గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స చేయడం ద్వారా 17 మంది వ్యాధి నుంచి కోలుకుని ఇళ్లకు వెళ్లారు. ఈవిషయంపై డాక్టర్ కాంతిమ పేపర్ ప్రజంటేషన్ ద్వారా రాష్ట్ర సదస్సులో వివరించగా, న్యాయనిర్ణేతలు ఆమెను విన్నర్‌గా ప్రకటించారు. అవార్డు పేపర్ గెలుపొందిన డాక్టర్ కాంతిమను, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వైద్య విద్యార్థులను సోమవారం న్యూరాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గొట్టిపాటి బిందునర్మద, డాక్టర్ భార్గవిలు అభినందించారు.

పురుగు మందుల నిల్వల గిడ్డంగుల్లో విజిలెన్స్ తనిఖీ




నగరంపాలెం: అనుమతుల్లేకుండా పురుగుమందులు విక్రయిస్తున్న గిడ్డంగుల్లో సోమవారం గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక వ్యవసాయ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు సోమవారం గుంటూరు నగరంలోని పురుగుమందుల గిడ్డంగుల్లో తనిఖీలు కొనసాగాయి. ఏటుకూరు రోడ్డులోని శ్రీపారిజాత ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ స్టోరేజ్ పాయింట్‌లో నిల్వ ఉన్న రెండు రకాల పురుగుమందుల గుళికల బస్తాలపై ముద్రించిన వివరాలు సరిగా లేకపోవడాన్ని గుర్తించారు. స్టాక్ బోర్డులో స్టాక్ వివరాలు సరిగా నమోదు చేయకపోవడంతో పురుగుమందుల చట్టాన్ని అతిక్రమించినట్లు కనుగొన్నారు. దీంతో రూ.10.48 లక్షల విలువ చేసే 38.195 మెట్రిక్ టన్నుల పురుగుమందుల గుళికల అమ్మకాలను నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ ఎస్.శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయ అధికారి (ఏఓ) రమణకుమార్, స్థానిక వ్యవసాయ అధికారి గౌతం ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ షార్ట్‌ఫిలిం 'కొండమ్మ'



మంగళగిరి: ప్రముఖ కవి దాశరథి శత జయంతి సందర్భంగా దాశరథి ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన షార్ట్‌ఫిలిమ్స్ పోటీలలో తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన త్రినేత్ర ప్రొడక్షన్ వారి కొండమ్మ చిత్రం నాలుగో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఈమేరకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కొండమ్మ చిత్ర యూనిట్ బృందం బహుమతి అందుకుంది. కొండమ్మ చిత్రంలో కొండమ్మ పాత్రను పోషించి బహుమతి అందుకున్న ఇల్లా మాధవిని పలువురు కళాకారులు అభినందించారు. చిత్ర దర్శకుడు గాదె నాగభూషణం ప్రతిభను కొనియాడారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



పెదకాకాని: లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం ఉప్పలపాడు సమీపంలో జరిగింది. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడుకు చెందిన నక్క కృష్ణ గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో దుగ్గిరాల నుంచి ఖమ్మం జిల్లా సత్తుపల్లికి పసుపు లోడుతో వెళ్తున్న లారీ ఢీకొనడంతో నక్క కృష్ణ(38) లారీ వెనుక టైర్ల కింద చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణకు భార్య ఆదిలక్ష్మి, కుమారుడు ఉన్నారు. మృతుడు కారు డ్రైవర్. ప్రమాద స్థలానికి స్థానికులు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ విభాగానికి పోలీసులు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అనారోగ్య సమస్యలు

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్ సీజనల్ వ్యాధులతో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని, ముఖ్యంగా పేదలు అధికంగా ఇబ్బందులకు గురవుతారని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కలుషిత నీటితోపాటు, పరిసరాలు శుభ్రతపైనా దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయి నుంచి ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. డెంగీకారక దోమలు ఎక్కువగా తాజా నీటిలో పెరుగుతాయని తెలిపారు. ఖాళీ ప్రదేశాల్లో, కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. యాంటీ లార్వా కార్యక్రమం పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమాలు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి హైజినిక్ యాప్‌లో స్థానిక పరిస్థితుల వివరాలను నమోదు చేయాలన్నారు. యాప్‌లో నమోదయ్యే సమస్యలు సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజన పథకం తీసుకునేలా చూడాలన్నారు. కౌలు రైతులకు పంట రాయితీలు అమలు చేయడంతోపాటు సీసీఆర్సీ కార్డులు అందజేయాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ విజయలక్ష్మి, సీపీఓ శేషశ్రీ, డీఆర్డీడీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మెగా ప్లాంటేషన్ విజయవంతం చేద్దాం

జిల్లాలో పచ్చదనాన్ని పెంచి వాతావరణ సమతౌల్యాన్ని సాధించేందుకు 50 లక్షల మొక్కల మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మెగా ప్లాంటేషన్‌కు వారం రోజుల్లోనే కార్యాచరణను రూపొందించాలన్నారు. పచ్చదనం పెంచే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఏక్ పేడ్ మాకేనామ్ కార్యక్రమం చేపడుతుందన్నారు. ఈ మొక్కల నాటే కార్యక్రమం ఆగస్టు 15 నుంచి ప్రారంభమై కార్తీక వన సమారాధన నాటికి పూర్తి చేయాలన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రణాళికలు రూపొందించాలన్నారు. దీంతోపాటు మొక్కలు నాటేందుకు స్కూళ్లు, కాలేజీలు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక వాడలు, హాస్టళ్లు, ప్రభుత్వాసుపత్రి, రోడ్డుకు ఇరువైపులా ఇలా అనువైన ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. నాటిన మొక్కలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వాటికి ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ మొక్కలు వివిధ నర్సరీల నుంచి కొనుగోలు చేసేందుకు సీఎస్ఆర్ నిధులను ఉపయోగించడంతోపాటు పారిశ్రామికవేత్తలు, పర్యావరణహితుల నుంచి విరాళాలు సేకరించాలన్నారు. డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, గంగరాజు, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీడీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దోమల ద్వారా వ్యాధుల వ్యాప్తి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: వర్షాకాలంలో మురుగు నిల్వ ఉండి దోమలు గుడ్లు పెట్టి ఆవాసాలుగా మారతాయని, తద్వారా దోమల ద్వారా వ్యాపించే మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు వ్యాధి ప్రబలే అవకాశం ఉంటుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చాంబర్‌లో మలేరియా సబ్ యూనిట్ అధికారులకు సీజనల్ డిసీజెస్‌పై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు పెరిగే వాతావరణాన్ని నిర్మూలించాలని తెలిపారు. దోమతెరలు వాడుకోవాలని, ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. నీరు కలుషితం అవడం వల్ల నీళ్ల విరేచనాలు, కలరా, బంక విరేచనాలు, టైఫాయిడ్ ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సురక్షితమైన నీటిని తాగాలని, కాచి చల్లార్చిన నీరు తాగడం ద్వారా, వ్యాధులను నిర్మూలించుకోవచ్చని తెలిపారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజునాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఘంటసాల శ్రీనివాసరావు, నరేంద్ర, ప్రశాంత్ శ్రీమన్నారాయణ, శేషగిరిరాజు, వెంకటప్పయ్య, సాంబయ్య, మలేరియా సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

శిక్షణల పేరుతో టీచర్లను బోధనకు దూరం చేయొద్దు



సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదిలక్ష్మి, కళాధర్

గుంటూరు ఎడ్యుకేషన్: వివిధ రకాల శిక్షణల పేరుతో విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం సరి కాదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల బాట పడుతున్న తరుణంలో ప్రభుత్వ విద్యను, బడిని బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం వివిధ రకాల శిక్షణ కార్యక్రమాల పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలలకు దూరం చేస్తోందని ఆరోపించారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నెల రోజుల కాలంలో జూన్ 14 నుంచి 16 వరకు ఓపెన్ స్కూల్ స్పాట్ వాల్యూయేషన్, జూలై డెట్బాల్ స్వస్థ్ ఇండియా పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలలకు దూరం చేశారని తెలిపారు. అలాగే ఈనెల 18న మొదలైన టీచ్ టూల్ శిక్షణ ఈనెల 27 వరకు జరుగుతుండగానే, తాజాగా సోమవారం ఇంగ్లిష్ లిటరసీ పేరుతో జిల్లాలోని మరి కొంత మంది ఉపాధ్యాయులను శిక్షణకు పిలిచారని వివరించారు. జూన్ 13 నుంచి 90 రోజులపాటు విద్యాప్రవేశ కార్యక్రమాల షెడ్యూల్ ఇచ్చి, తాజాగా ఈనెల 28 వరకు శిక్షా సప్తాహ్ పేరుతో మరో షెడ్యూల్ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలలు ఒకరిద్దరు ఉపాధ్యాయులతో నడుస్తున్న పరిస్థితుల్లో శిక్షణ కార్యక్రమాల వలన సంబంధిత ఉపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారని, తక్షణమే శిక్షణ కార్యక్రమాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు కార్యదర్శి సీహెచ్ ఆదినారాయణ పాల్గొన్నారు.

26,27 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గుంటూరు జిల్లా ప్లీనరీ సమావేశాలు ఈనెల 26, 27 తేదీల్లో గుంటూరు నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తెలిపారు స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై పోరాటం చేసేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునేందుకు ఈ సమావేశాలు వేదిక కానున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో రాజధాని ప్రాంతంలో భూముల సేకరణ సమయంలో అక్కడ విద్యాసంస్థల్లో 10% సీట్లను రాజధాని ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, దీన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 77ని వెంటనే రద్దు చేయాలని, హాస్టళ్లను పెంచాలని, వసతులు కల్పించాలని, మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్ ఉపాధ్యక్షురాలు సుచరిత, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గరువుపాలెం శివాలయంలో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు, హుండీలో నగదు, పంచలోహ విగ్రహాలు అపహరణ



వస్తువులు చోరీకి గురైన శివాలయంలోని అమ్మవారి విగ్రహం

చేబ్రోలు: ప్రధాన రహదారి పక్కనే ఉన్న దేవాలయంలో దొంగలు పడి విలువైన బంగారు, వెండి వస్తువులు, హుండీలోని నగదు అపహరించుకుపోయిన ఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెంలో సోమవారం జరిగింది. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. గరువుపాలెం సంగంజాగర్లమూడి లాకుల సమీపంలోని తెనాలి రోడ్డు పక్కన దుర్గా సిద్ధేశ్వర మణికంఠ క్షేత్రాన్ని భక్తులు నిర్మించారు. శివుడు, దుర్గాదేవి, అయ్యప్ప స్వామి కొలువై ఉన్న ఈ ఆలయానికి పరిసర గ్రామాలతోపాటు దూరప్రాంతాల నుంచీ భక్తులు తరలివస్తారు. సోమవారం ఉదయం ఆలయం తలుపులు తీయటానికి వచ్చిన పూజారి చోరీ జరిగినట్లు గుర్తించి ఆలయ నిర్వాహకులకు సమాచారం అందించాడు. ఆలయం ప్రధాన ద్వారం తలుపును పగలకొట్టిన ఆగంతకులు గుడిలోని ఇతర తాళాలను తీసుకొని చోరీ చేశారు. దుర్గాదేవి అమ్మవారి మెడలో ఉన్న బంగారు మంగళసూత్రాలు, ఇతర వస్తువులు, శివుని విగ్రహం వద్ద ఉన్న వెండి నాగసర్పంతోపాటు చిన్న పంచలోహ విగ్రహాలు అపహరణకు గురయ్యాయి. వీటితో పాటు ఆలయ ప్రాంగణంలోని రెండు హుండీలను పగలగొట్టి అందులోని నగదును దొంగలించుకుపోయారు. ఆరు నెలలుగా హుండీలోని నగదును లెక్కించలేదని నిర్వాహకులు తెలిపారు. ఆలయ పూజారి బెల్లంకొండ వెంకటేశ్వరరావు చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. చేబ్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.